క్లుప్తంగా

ప్రభుత్వ శాఖల భవనాలకు పన్ను బకాయిలు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో 54 రాష్ట్ర ప్రభుత్వ, ఒక కేంద్ర ప్రభుత్వ భవనాలకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయాయని కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే అనేకసార్లు ఆ ప్రభుత్వ భవనాల అధికారులకు బకాయి పన్నులు చెల్లించాలని కోరినా ఫలితం లేదని పేర్కొన్నారు. దీంతో శాఖల వారీగా బకాయిల జాబితాలను సిద్ధం చేసి కలెక్టర్ మహేష్‌కుమార్‌కు నివేదిక అందించినట్టు తెలిపారు. అవసరమైతే మున్సిపాలిటీ ఆన్‌లైన్ చెల్లింపులు, త్రైమాసిక వాయిదా సదుపాయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని కమిషనర్ స్పష్టం చేశారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

యానాం: కనకాలపేట రక్షిత మంచినీటి పథకం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో క్లోరిన్ గ్యాస్‌లీకై అస్వస్థతకు గురై యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వీడియోకాల్ ద్వారా పరామర్శించారు. స్థానిక ప్రముఖ వ్యాపారవేత్త తోట రాజు బాధితులను ఆసుపత్రిలో పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలపై చర్చించి మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

తాచుపాముతో వ్యక్తి హల్‌చల్


గొల్లపల్లి కొండ

ముమ్మిడివరం: మండలంలోని కమిని పంచాయతీ శివారు పొట్టితిప్పకు చెందిన గొల్లపల్లి కొండ ఇంటి ఆవరణలో కోళ్లను ఉంచిన గంపలోకి మంగళవారం తాచుపాము దూరింది. పాముని గమనించని కొండను కాటు వేసింది. దీంతో మద్యం మత్తులో ఉన్న కొండ నన్నే కాటు వేస్తావా అంటూ ఆ పామును మెడలో వేసుకుని హల్‌చల్ చేశాడు. గ్రామస్తులు వారించిన పామును వదలక పోవడంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మరోసారి పాము అతనిని కాటు వేసింది. వెంటనే గ్రామస్తులు పామును హతమార్చి పాము కాటుకు గురైన బాధితుడిని వెంటనే టి.కొత్తపల్లి పీహెచ్‌సీకి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

11న సునామీ మాక్ డ్రిల్ నిర్వహణ

యానాం: సునామీ వంటి ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితుల వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు తదనంతరం బాధితుల ప్రాణరక్షణ, ఆస్తి నష్టం నివారణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లుపై ముందస్తుగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 11న యానాంలో సునామీ మాక్ ఎక్సైర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు ఆర్ఎఒ అంకిత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన కార్యాలయంలో మాక్ డ్రిల్‌కు సంబంధించి రెవెన్యూ, విద్యుత్, పీడబ్ల్యూడీ, ఆరోగ్య, వ్యవసాయ, అగ్నిమాపకదళ, పోలీసు, ఎన్‌డీఆర్ఎఫ్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు.

ఆర్ఏఓకు తీవ్ర అస్వస్థత

యానాం: కనకాలపేటలో రక్షితమంచినీటి పథకం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో క్లోరిన్‌గ్యాస్ లీక్ ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళ్లిన ఆర్ఎఒ, ఐఎఎస్ అధికారి అంకిత్‌కుమార్ ఆఫీసుకు చేరుకున్న తర్వాత మంగళవారం రాత్రి ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులకు గురవ్వడంతో ఆయనను ప్రభుత్వ ఆసుపత్రి డిడి రవికుమార్ ఆధ్వర్యంలో వైద్యులు పరిశీలించారు. ఆర్ఎఒ ఆఫీసులోనే ఆక్సిజన్ సైతం పెట్టి వైద్యాన్ని అందించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆయను పరామర్శించారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

అల్లవరం: యూరియాకి బదులుగా నానో యూరియాను వినియోగించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు అన్నారు. కోడూరుపాడులో మండల వ్యవసాయాధికారి కె.విజయ్ ఆధ్వర్యంలో నానో యూరియాను డ్రోన్‌తో పిచికారీ చేసే విధానంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో నగదు చోరీ

అల్లవరం: తూర్పులంక సచివాలయం చెంతనే ఉన్న కిరాణా షాపులో యువకుడు, బాలుడు కలసి మంగళవారం మధ్యాహ్నం చోరీకి పాల్పడ్డారు. మోటారుసైకిల్‌పై వచ్చిన ఇద్దరూ కిరాణా షాపు వద్ద ఆగి అక్కడ ఎవరూ లేకపోవడంతో గల్లా పెట్టిలోంచి చేతికి అందిన కాడిన దోచుకుని ఉడాయించారు. షాపు యజమాని కాండ్రేగుల వీర వెంకటసత్యనారాయణ (బుజ్జి) ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలో చోరీ ఘటన రికార్డు అయింది. సీసీ పుటేజీ ఆధారంగా షాపు యజయాని అల్లవరం పోలీస్‌స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

రైతన్నకు బాసటగా పోరుబాట

- ఎరువుల కోసం కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారంటూ ఆగ్రహం
- అమలాపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా


అమలాపురం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు సూర్యారావు, సతీష్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు

అమలాపురం టౌన్/ అమలాపురం రూరల్: ఎరువుల కోసం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు రైతుల పక్షాన పోరాడి నిరసలతో మంగళవారం కదం తొక్కారు. ఎరువులను దళారులకు అప్పగించి బ్లాక్ మార్కెట్ తరలించి రైతులను అవస్థలకు గురి చేస్తారా...అని బాధిత రైతులతో కలసి పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అమలాపురం పట్టణంలో పార్టీ నాయకులు బైక్ ర్యాలీ, ధర్నాలతో నిరసనలు తెలిపారు. అన్నదాత పోరుతో ఈ నిరసన కార్యక్రమం సాగింది.

పోలీసు ఆంక్షల నడుమ బైక్ ర్యాలీతో నిరసన

అమలాపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి కార్యాలయ ఏవో భాస్కరరావుకు వినతిపత్రం అందించారు. అంతకు ముందు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, రాజోలు, ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఈ ధర్నాకు నాయకత్వం వహించారు. పోలీసుల ఆంక్షల నడుమ బైక్ ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. తొలుత అమలాపురం సమీపంలోని భట్నవిల్లిలోని పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఇంటికి మూడు నియోజకవర్గాల పార్టీ శ్రేణులు రైతులతో చేరుకున్నారు. అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం రోడ్డు (ఎన్టీఆర్ మార్గ్) వరకూ బైక్ ర్యాలీతో తరలివచ్చారు. ఎర్ర వంతెన వద్ద, ఎన్టీఆర్ మార్గ్‌లో రెండు చోట్ల పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులను అడ్డుకున్నారు.


అమలాపురం ఆర్డీవో కార్యాలయం సమీపంలో బారికేడ్లు పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు


ఆర్డీవో కార్యాలయం వద్ద బైక్ ర్యాలీతో వస్తున్న పార్టీ నాయకులు

కేవలం 25 మంది ముఖ్యమైన నాయకులను మాత్రమే ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించేందుకు అనమతించారు. ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, నియోజకవర్గాల పార్టీ కో ఆర్డినేటర్లు సూర్యారావు, సతీష్‌కుమార్, శ్రీకాంత్‌తో పాటు రాష్ట్ర పార్టీ కార్యదర్శులు, జిల్లా అనుబంధ కమిటీ నాయకులు ఆర్డీవో కార్యాలయం ఎదట ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రం అందించారు.

రైతులకు కూటమి దగా

ధర్నా అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ప్రభుత్వం దళారులను ప్రోత్సహించి ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తోందని ఆరోపించారు. రైతులను అన్ని విధాలా కూటమి ప్రభుత్వం దగా చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం ఎరువుల కొరతతో నట్టేట ముంచిందని ఆరోపించారు. మాజీ మంత్రి సూర్యారావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా రైతులను అన్ని విధాలా ఆదుకుంటే కూటమి ప్రభుత్వం అడుగడుగునా అన్నదాతలను వంచిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అన్నం పెట్టే రైతు కన్నీరు కారుస్తున్నాడని, పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

దళారుల పాలవుతున్న ఎరువులు

అమలాపురం పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎరువులను మార్కెట్ ఫెడ్‌కు 50 శాతం, ప్రైవేటు షాపులకు 50 శాతం ఇవ్వాలన్న నిబంధనలున్నా ఈ ప్రభుత్వం మార్కెట్ ఫెడ్‌కు భారీగా తగ్గించి ప్రైవేటు వ్యాపారులకు ఎక్కువ శాతం ఇవ్వడం వల్లే ఎరువులు బ్లాక్ మార్కెట్, దళాలరులు పాలయ్యాయని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కర్రి పాపారాయుడు, పితాని బాలకృష్ణ, రుద్రరాజు చిన్నరాజా, పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్, మున్సిపల్ చైర్మన్లు రెడ్డి సత్యనాగేంద్రమణి, కడిమి ప్రవీణ్, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, కొనుకు గౌతమి, కుడుపూడి శంకరరావు, దొమ్మేటి సాగరస్వామి, పట్టణ, మండలాల పార్టీల అధ్యక్షుడు సంసాని బులినాని, కొనుకు బాపూజీ, గుత్తుల చిరంజీవిరావు, బద్రి బాబ్జీ, నల్లా నరసింహమూర్తి, జగతా బాబ్జీ, పిన్నమరాజు శ్రీనివాసరావు, కాదా గోవిందకుమార్, పార్టీ జిల్లా అనుబంధ కమిటీల అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, చీకట్ల కిషోర్, వంగా గిరజాకుమారి, షేక్ అబ్దుల్ ఖాదర్, తోరం గౌతమ్ రాజా, మిండగుదటి శిరీష్, సూదా గణపతి, జిల్లెళ్ల రమేష్, బొక్కా ఆదినారాయణ, కాశి మునికుమారి, పెన్మత్స చిట్టిరాజు, కుడుపూడి బాబు, పొగాకు శ్రీను, ఉండ్రు బాబ్జి, సరెళ్ల రామకృష్ణ, కముజు రమణ, కాశి రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు


ఐ.పోలవరంలో ఆటో డ్రైవర్ల నిరసన ప్రదర్శన

ఐ.పోలవరం: మహిళల ఉచిత బస్సు పథకం వల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని ఆరోపిస్తూ ఐ.పోలవరం మండల పరిధిలోని ఆటో డ్రైవర్లు మంగళవారం భారీ నిరసనకు దిగారు. స్థానిక మురమళ్ల సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన రహదారిపై బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఐ.పోలవరం మండలం ఆటో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో ''తెచ్చారు ఉచిత బస్సు- కూల్చారు ఆటో కార్మికుల బ్రతుకులు'' అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మురమళ్ల సెంటరు నుంచి ఐ.పోలరం తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. ఉచిత బస్సు పథకం వల్ల తమకు రోజువారీ ఆదాయం పోయిందని జేఏసీ అధ్యక్షుడు మచ్చా నాగబాబు ఆరోపించారు. ఆటోలకు ఫైనాన్స్ కూడా కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా కార్మిక భృతి అందించాలని, కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన ఆటో కార్మికులకు పింఛన్ పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ సిహెచ్.విజయశ్రీకి వినతి పత్రం అందజేశారు. నిరసన ప్రదర్శన కారణంగా 216 జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ఆందోళనలో వీధి శేఖర్ బాబు, నక్కా రామకృష్ణ, ఆర్.రాధాకృష్ణ, జె.రాజారావు, కమిడి కిరణ్ కుమార్, అప్పాడి చంటిలు పాల్గొన్నారు.

స్థలం కోసం పోటా పోటీ ఆందోళనలు

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెంలో యానాం-ద్రాక్షారామ రోడ్‌కు ఆనుకుని ఉన్న ఓ స్థలంలో గ్రామ సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు సర్వే నంబర్ 123 లోని మూడు సెంట్ల భూమిలో చేపట్టిని నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని గ్రామానికి చెందిన పలువురు మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టరంటూ ఆందోళన వ్యక్తం చేయగా, అది సర్పంచ్‌కు చెందిన స్థలమేనంటూ మరో వర్గం వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ సర్వే నంబరులో ఇప్పటికే 40 మంది గృహాలు నిర్మించుకున్నారని, ఇటీవల కూడా రెండు కాంప్లెక్స్‌లు నిర్మించి గృహప్రవేశాలు చేసుకున్నారని వాటన్నింటికీ లేని అభ్యంతరం తమకు ఎందుకు సృష్టిస్తున్నారని సర్పంచ్ వాపోయారు. కాగా ఈ స్థలం సర్వే నెంబరు 125లో ఉందని, నిర్మాణాలు చేయడం తగదని, మరో వర్గానికి చెందిన వారు ఆరోపిస్తున్నారు. కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ టి.సూరిబాబులు సంఘటనా స్థలానికి చేరుకుని వారితో చర్చించారు. దీనిపై ఇరు వర్గాలతో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరించనున్నట్టు తహసీల్దార్ పితాని త్రినాథరావు తెలిపారు.

ఫ్రెంచ్ సంస్కృతిని విస్తరించేందుకు కృషి


ఆర్ఏఒ అంకిత్ కుమార్‌తో సమావేశమైన ఫ్రెంచ్ ప్రతినిధుల బృందం

యానాం: ఫ్రెంచ్ కాలనీగా ప్రసిద్ధి చెందిన కేంద్రపాలిత ప్రాంతం యానాంలో ఫ్రెంచ్ భాషా కోర్సులు ఉచితంగా నేర్పడానికి, సాంస్కృతిక మార్పిడి తదితర అంశాలపై చర్చించేందుకు మంగళవారం యానాం వచ్చిన అలియన్స్ ఫ్రాంకైజ్ ది పుదుచ్చేరికి చెందిన ఐదుగురు సభ్యుల ఫ్రెంచ్ ప్రతినిధుల బృందం ఆర్ఏఒ, ఐఎఎస్‌అధికారి అంకిత్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా యానాంలో ఓ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్‌లో ఫ్రెంచ్ భాషా కోర్సును ఉచితంగా నేర్పడానికి అనుమతి తదితర అంశాలు గూర్చి చర్చించారు. ఫ్రెంచి ఫిల్మ్ ఫెస్టివల్, ఇండో-ఫ్రెంచ్ సంబంధాల పటిష్టత, అంతర్ సాంస్కృతిక అంశాల మార్పిడి ఫ్రెంచ్ సంస్కృతిని యానాం ప్రజలు అవగాహన చేసుకోవడానికి ఉపకరిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో సాంస్కృతిక అభివృద్ధి అధికారి ఆర్థనార్డ్ రోండో, కమ్యూనికేషన్ అధికారి మేరియన్ సికార్డ్, యానాంలో ఫ్రెంచ్ పౌరుల ప్రతినిధి సాధనాల బాబు, విద్యాశాఖాధాకారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, హెచ్ఎం కమిడి ప్రభాకరరావు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు చట్టాలపై అవగాహన


మహిళా ఉద్యోగులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ మాధవి

తాళ్లరేవు: గాడిమొగ రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిలయన్స్ డీజీఎం పి.సుబ్రహ్మణ్యం సహకారంతో జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ, ఐసీడీఎస్ తాళ్లరేవు ప్రాజెక్టు, డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ మాధవి ఆధ్వర్యంలో సంకల్ప కార్యక్రమంలో భాగంగా పది రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు చట్టాలపై సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.శైలజ, పారా లీగల్ పర్సనల్ పి.నాగలక్ష్మి, కౌన్సిలర్ ఎంజే మియా కేసు వర్కర్ బీవీవీ లక్ష్మీదేవి అవగాహన కల్పించారు.

పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

తాళ్లరేవు: చొల్లంగిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో మంగళవారం ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఎంపీపీ రాయుడు సునీత హాజరై పరిశీలించారు. ఈ శిబిరంలో గేదెలు, ఆవులకు పశు వైద్యులు ఏపీఎస్ శుభశ్రీ, డి.సుధ, సుధీర్, కల్యాణి పరీక్షలు నిర్వహించారు. పశు వ్యాధుల నివారణకు మందులు పంపిణీ చేసారు. ఈ నెల 15 నుంచి అక్టోబరు 15 వరకు పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు వేస్తామని తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కాంతారావు, అసిస్టెంట్ డైరెక్టర్ డి.బ్రహ్మవేద, స్థానిక నాయకులు గద్రే లక్ష్మీనారాయణ, కట్టా త్రిమూర్తులు, పి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆక్వా సదస్సును జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

తాళ్లరేవు: పెరిగిన ఫీడు ధర, ఇతర ఖర్చులు కారణంగా ఈ నెల 11వ తేదీన విజయవాడలో నిర్వహించే ఆక్వా సదస్సును జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల వల్ల ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని, ఆక్వా రంగం కుదేలైయ్యి రొయ్య రైతులు ఆందోళన పడుతున్నారన్నారు. ఆక్వారైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీలు సబ్సిడీలు కేంద్రం భరించేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. విజయవాడ సభకు పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చిన జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎం.రాజశేఖర్, టి.ఈశ్వరరావు, కె.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు ఉచిత భిక్ష


సమావేశంలో పాల్గొన్న కోనసీమ మహాశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు

అమలాపురం రూరల్: అమలాపురం ఈదరపల్లి బైపాస్ రోడ్‌లో ఉన్న కోనసీమ మహా శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం వద్ద అక్టోబర్ 2 విజయదశమి రోజు నుంచి 100 రోజులపాటు దాతలు, భక్తుల సహాయ సహకారంతో అయ్యప్ప మాలధారులకు ఉచిత భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బండారు గంగాధర్ గురుస్వామి ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 12న బుధవారం లక్షపత్రి పూజ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో శాశ్వత గౌరవ అధ్యక్షుడు మోరం దొరబాబు, రామాయణం వెంకటేశ్వరరావు, సంగినీడి గణేష్, ఉపాధ్యక్షుడు అడపా శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మిక నేత శ్రీనివాసరావు మృతికి సంతాపం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం ఈదబ్ల్యూఎస్ కాలనీకి చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు, జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల శ్రీనివాసరావు మృతి చెందారు. అతని భౌతికకాయాన్ని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. శ్రీనివాసరావు అంత్యక్రియల నిమిత్తం మున్సిపాలిటీ తరపున అతని కుటుంబ సభ్యులకు రూ.15 వేల నగదు కమిషనర్ అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.సత్తిబాబు, మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణ, కార్మిక నాయకులు వాసంశెట్టి సత్తిరాజు, కొప్పుల బాబి తదితరులు శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలిపారు.

విజయమే లక్ష్యంగా కృషి చేయాలి

అమలాపురం రూరల్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు పక్కా ప్రణాళికతో అడుగులు వేసి విజయమే లక్ష్యం కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కోనసీమ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. విజయశ్రీ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిషన్ శక్తి సంకల్ప ప్రోగ్రాంలో భాగంగా అమలాపురం కామనగరువులో ది అమలాపురం డిగ్రీ కళాశాలలో మంగళవారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పీడీ విజయశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వన్ స్టెప్ సెంటర్ ద్వారా అందించే సేవలను సద్వినియోగం చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టెప్ సెంటర్ ఏవో అంబికా దేవి, కేస్ వర్కర్స్ గంగా భవాని, స్వప్న, అరుణ, కౌన్సిలర్ భవాని, కళాశాల డైరక్టరు పాల్గొన్నారు.

సర్క్యులర్ బజార్ షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలన

సాక్షి స్పందన


సర్క్యులర్ బజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ నిర్మల్‌కుమార్

అమలాపురం టౌన్: స్థానిక సర్క్యులర్ బజార్ షాపింగ్ కాంప్లెక్స్ దుస్థితిపై 'కోట్ల ఆదాయం ఉన్నా...సౌకర్యాలు సున్నా' శీర్షికతో ఈనెల 8న సాక్షిలో ప్రచురితమైన వచ్చిన కథనానికి మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ స్పందించారు. మున్సిపాలిటీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి కమిషనర్ మంగళవారం ఆ షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ కాంప్లెక్స్‌లో షాపుల లీజుదారులకు అసౌకర్యంగా ఉన్న టాయిలెట్లు, పార్కింగ్, తాగునీరు, శుభ్రత తదితర సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులతో కమిషనర్ చర్చించారు. అనంతరం షాపుల లీజుదారులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న అసౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సర్క్యులర్ బజార్ వెనుక ఖాళీగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని కమిషనర్ నిర్ణయించారు. మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణ, ఏఈ వెంకటేష్, టౌన్ ప్లానింగ్ అధికారి రాణి సంయుక్త తదితరులు ఉన్నారు.

అత్తింటి వేధింపులపై మహిళ ఫిర్యాదు

అమలాపురం టౌన్: కుటుంబ వివాదాల కారణంగా ఇబ్బందులకు గురవుతున్నానని న్యాయం చేయాలని కోరుతూ జానికీపేటకు చెందిన నౌండ్రు మీనాక్షి అమలాపురం ఆర్డీవోను ఆశ్రయించింది. కుటుంబ వివాదాలను పరిష్కరించాలని కోరతూ ఆమె ప్రజా సంఘాల నాయకులతో కలసి మంగళవారం ఆర్డీవో కార్యాలయానికి వచ్చి ఏవో భాస్కరరావుకు వినతిపత్రం అందించారు. 2023లో తన భర్త జగదీష్‌కుమార్ మరణించారని, అప్పటి నుంచి తన అత్త, ఇతర కుటుంబ సభ్యులు ఇంట్లోకి రానివ్వకుండా బెదిరిస్తున్నారని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త మరణించాక అత్త, మరిదుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆమె వాపోయింది. తన భర్త పేరిట జానికీపేటలో ఇల్లు, షాపింగ్ కాంప్లెక్సు ఉన్నాయని చెప్పింది. ఆ ఆస్తులపై తన అత్త కుటుంబ సభ్యులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆమె అన్నారు. తనకు, తన కుమారుడికి ఎలాంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నామని, న్యాయం చేయాలని కోరింది. బాధితురాలు మీనాక్షికి మద్దతుగా కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం అండగా నిలిచాయి. కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు తదితరులు మీనాక్షికి మద్దతు తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన, పద్య పఠన పోటీలు

అమలాపురం టౌన్: జిల్లా సంస్కార భారతి ఆధ్వర్యంలో కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి సందర్భంగా జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులకు స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో వ్యాస రచన, పద్య పఠన పోటీలను మంగళవారం నిర్వహించింది. సంస్కార భారతి జిల్లా అధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు హాజరయ్యారు. సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీఆర్ నాయుడు, కోశాధికారి ఈమని సాయికృష్ణ, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి పోటీ విజేతలను సంస్కార భారతి ప్రతినిధులు వెల్లడించారు. విజయవాడలో బుధవారం నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

5కే మారథాన్ రన్‌లో కొత్తపేట విద్యార్థులకు బహుమతులు

కొత్తపేట: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలాపురంలో మంగళవారం నిర్వహించిన 5కే మారథాన్ రన్‌లో కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి నగదు బహుమతులు పొందినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ, ఎయిడ్స్, అండ్ లెప్రసీ అధికారిణి డాక్టర్ భరతలక్ష్మి ఆధ్వర్యంలో 5కే మారథాన్ రన్ నిర్వహించారు. కొత్తపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ నాగేంద్రమురళి ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేలు, బీఎస్ఆర్ రాజు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7 వేలు, మహిళల విభాగంలో వైపీఎస్‌డీ సంతోషి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7 వేలు పొందారు. విజేతలను కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.అంకమరావు, పీడీ కే కనక రాజు, అధ్యాపకులు అభినందించారు.